
బడి భద్రంగానే ఉందా..?
3

జర్నలిస్ట్ వార్త
కథనానికి స్పందన

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 3 సంచిక -105 ఆదివారం 27 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

: ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్



**ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణపై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు**

**యువతను లక్ష్యంగా చేసుకుని జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారని ధ్వజం**

**ఢిల్లీసెప్టెంబరు 26(జర్నలిస్ట్ వార్త):** భారత ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ**మిగతా 2లో...**

# నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

## ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్




**ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..**

**ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ**

**నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు**

**ఓటర్ల సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి**

**పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు**

**ఈసీఐనెట్ పోర్టల్‌పై సమీక్షకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు**

**ఢిల్లీ సెప్టెంబరు 26(జర్నలిస్ట్ వార్త):** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి **మిగతా 2లో...**

## కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్

## పురుషుల, మహిళల ఫైనల్స్‌లో ఇరాన్‌పై ఘన విజయం

**ఒకే రోజు కబడ్డీలో స్వర్ణాలు సాధించిన మహిళల, పురుషుల జట్లు**

**గత టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్న భారత జట్లు**





**ఢిల్లీసెప్టెంబరు 26(జర్నలిస్ట్ వార్త):** ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో మెరిశాయి. నేడు జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్స్‌లో పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌ను ఓడించి తమ టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్నాయి. దీంతో భారత కబడ్డీ ఒకే రోజు రెండు స్వర్ణాలను ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకుంది.పురుషుల ఫైనల్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. **మిగతా 2లో...**

## కాళేశ్వరం పునరుద్ధరణకు రంగం సిద్ధం

**నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం**

**2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం**

**అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు : అధికారులు**

**భద్రత, నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్ సెప్టెంబరు 26(జర్నలిస్ట్ వార్త):** కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన **మిగతా 2లో...**

## 10 శాతం వృద్ధి సాధ్యమే

**: టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు**

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు**



## రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

**హైదరాబాద్‌సెప్టెంబరు 26(జర్నలిస్ట్ వార్త):** సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు.తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, **మిగతా 2లో...**



## కర్నూలును ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు

**రాష్ట్రంలో ఏవియేషన్, డ్రోన్ రంగాలకు కర్నూలు కీలక కేంద్రం**

**కర్నూలు ఎయిర్‌పోర్టులో ఓరియంట్ ఫ్లయింగ్ అకాడమీ ఎఫ్‌టీఓ ప్రారంభం**

**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**




**ఓర్వకల్ సెప్టెంబరు 26(జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్‌ను ఏవియేషన్ హబ్‌గా అభివృద్ధి చేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. **మిగతా 2లో...**

## మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

## : ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



**హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ**

**పీవీ, మన్మోహన్ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని వ్యాఖ్య**

**మౌనాన్ని భాషగా మార్చి గొప్ప పాలన అందించారని ప్రశంస**

**హైదరాబాద్ సెప్టెంబరు 26(జర్నలిస్ట్ వార్త):** మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్ **మిగతా 2లో...**



## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

**ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు**

**సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు**

**పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ**

**వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం**

**అమరావతి సెప్టెంబరు 26(జర్నలిస్ట్ వార్త):** సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. **మిగతా 2లో...**

## భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం సమీక్ష

**వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం**

**ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు**

**తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు**

**రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల**

**అమరావతి సెప్టెంబరు 26(జర్నలిస్ట్ వార్త):** గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు.**మిగతా 2లో...**



# కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్

**మొదటిపేజీ తరువాయి**

భారత జట్టు 40-34 తేడాతో ఇరాన్‌పై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఒక దశలో ఇరు జట్ల స్కోర్లు 20-20తో సమంగా నిలిచాయంటే పోరు ఎంత తీవ్రంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, కీలక సమయంలో పుంజుకున్న భారత క్రీడాకారులు ఇరాన్‌పై పైచేయి సాధించి విజయాన్ని అందుకున్నారు. వరుసగా ఏడుసార్లు స్వర్ణాలు గెలిచిన భారత పురుషుల జట్టు, 2018 జకార్తా గేమ్స్‌లో ఇరాన్ చేతిలో ఓడి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే, ఆ తర్వాత పుంజుకుని 2023లో టైటిల్ గెలిచి, ఇప్పుడు దాన్ని నిలబెట్టుకుని మరోసారి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

అంతకుముందు జరిగిన మహిళల ఫైనల్‌లో కూడా భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇరాన్‌పై 37-34 తేడాతో గెలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. దీంతో రెండు విభాగాల్లోనూ ఇరాన్‌ను ఓడించి భారత్ డబుల్ గోల్డ్ సాధించినట్టయింది.

# మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మౌనాన్ని తన భాషగా మార్చుకుని, దేశానికి అద్భుతమైన పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అంతటి మహనీయుడికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకుని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దార్శనికత వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, దాని ఫలితంగానే నేడు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాన్ని తీసుకువచ్చి, భూనిర్వాసితుల అంగీకారాన్ని తప్పనిసరి చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.

మన్మోహన్ సింగ్ జీవితం నేటి 'జెన్-జెడ్' సహా అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలును ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు





**మొదటిపేజీ తరువాయి** కర్నూలు జిల్లాను ఏవియేషన్, డ్రోన్, పారిశ్రామిక రంగాలకు కీలక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.కర్నూలు విమానాశ్రయంలో హిందుస్థాన్ గ్రూప్‌కు చెందిన ఓరియంట్ ఫ్లయింగ్ అకాడమీ ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ)ను కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తొలి ఎఫ్‌టీఓను కర్నూలులో ఏర్పాటు చేయడం చారిత్రాత్మక పరిణామమన్నారు. కేవలం విమానాశ్రయాల నిర్మాణానికే పరిమితం కాకుండా శిక్షణ, విమానాల నిర్వహణ, గ్రౌండ్ ఆపరేషన్స్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ తదితర అన్ని విభాగాలతో సమగ్ర ఏవియేషన్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.దేశంలో 2014లో 74 విమానాశ్రయాలు ఉండగా ప్రస్తుతం సుమారు 166కు చేరాయని మంత్రి వెల్లడించారు. విమానాశ్రయాలు, విమానాలు, ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం కూడా పెరుగుతోందన్నారు. ఈ అవసరాన్ని తీర్చడంలో ఎఫ్‌టీఓల పాత్ర కీలకమని పేర్కొన్నారు.కర్నూలు భౌగోళికంగా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సమీపంలో ఉండటంతో ఏవియేషన్ కార్యకలాపాలకు అనుకూల ప్రాంతమని మంత్రి తెలిపారు. ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న విమానాశ్రయంతో పాటు ఏడాది పొడవునా అనుకూల వాతావరణ పరిస్థితులు ఉండటం పైలట్ శిక్షణకు అదనపు ప్రయోజనమన్నారు. ప్రస్తుతం ఎఫ్‌టీఓలో మూడు శిక్షణ విమానాలు ఉన్నాయని, వాటి సంఖ్యను త్వరలో 10కి పెంచి కర్నూలును దేశంలోని ముఖ్యమైన ఏవియేషన్ కేంద్రాల్లో ఒకటిగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.ఎఫ్‌టీఓ ద్వారా ఏడాదికి సుమారు 60 మంది విద్యార్థులకు శిక్షణ అందించే సామర్థ్యం ఏర్పడుతుందని తెలిపారు. దీనితో పాటు విమానాల నిర్వహణ, గ్రౌండ్ ఆపరేషన్స్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు

# కాళేశ్వరం పునరుద్ధరణకు రంగం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి** సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

# 10 శాతం వృద్ధి సాధ్యమే

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు.దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

# రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి**

కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు.ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు.2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు.

# నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

**మొదటిపేజీ తరువాయి**

ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ూ×=), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది.

కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది.

గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మందిలో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం-6 సమర్పించారని వెల్లడించింది.

ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ఈసీఐనెట్ (జుజ×చీజు) పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్-బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది.

అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది. కమిషనర్లు అధికారులకు జారీ చేసే ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ప్రత్యేక సవరణ గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రధాన నిర్ణయాలన్నీ సమష్టిగా, ఏకగ్రీవంగానే తీసుకున్నామని కమిషన్ పునరుద్ఘాటించింది.

# సీఈసీ రాజీనామా చేయాల్సిందే

**మొదటిపేజీ తరువాయి**

జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది.ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు."మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు.సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్ ్గ) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

# పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

**మొదటిపేజీ తరువాయి**

వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు.

డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు



షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది.నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

# భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం సమీక్ష

**మొదటిపేజీ తరువాయి**

శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

**కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి**

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు.

అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

**నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు**

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు.

గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది: సీఎం చంద్రబాబు



భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు.

స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

# పేద విద్యార్థికి ఎమ్మెల్యే అండ..

## రెండో ఏడాదీ ఫీజు సాయం

### ఎంబీబీఎస్ విద్యార్థి నితిన్‌కు రూ.20 వేల ఆర్థిక సహాయం



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబరు 26 (జర్నలిస్ట్ వార్త):** పేదరికం ప్రతిభకు అడ్డుకాకూడదనే ఉద్దేశంతో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఎంబీబీఎస్ విద్యార్థికి వరుసగా రెండో ఏడాది ఆర్థిక సాయం అందించారు. ధర్మసాగర్ మండలం దేవునూర్ గ్రామానికి చెందిన చిట్యాల నితిన్ ప్రతిభతో ఎంబీబీఎస్ సీటు సాధించినప్పటికీ, కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా కళాశాల ఫీజు చెల్లించడం భారంగా మారింది. విషయం తెలుసుకున్న కడియం శ్రీహరి గతంలో నితిన్ మొదటి సంవత్సరం ఫీజుకు ఆర్థిక సహాయం అందించారు. తాజాగా రెండో సంవత్సరం చదువుకు రూ.20 వేల నగదును అందించారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని తన నివాసంలో విద్యార్థికి సాయం అందించిన ఎమ్మెల్యే.. నితిన్ ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. సమయానికి అండగా నిలిచి వరుసగా రెండో ఏడాది కూడా ఆర్థిక సహాయం అందించిన కడియం శ్రీహరికి నితిన్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే అందించిన ప్రోత్సాహం తన ఆశయ సాధనకు మరింత ధైర్యాన్నిచ్చిందని నితిన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజుగారి రఘు, మాజీ సర్పంచ్ చిర్ర కుమార్, స్థానిక నాయకులు, నితిన్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సామాజిక న్యాయంపై సమరశంఖం

### బీసీఎస్సీఎస్టీలకు జనాభా ప్రాతిపదికన వాటా కోసం గళమెత్తాలి

### నేడు హనుమకొండలో బహిరంగ సభ.. విజయవంతం చేయండి: కొట్టే ఏసేబు




**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరోసెప్టెంబరు 27 (జర్నలిస్ట్ వార్త):** సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఐక్యంగా ఉద్యమించాలని బీసీఎస్సీఎస్టీ జేఏసీ హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ కొట్టే ఏసేబు పిలుపునిచ్చారు. ఎవరి కులం ఎంతోవారికంత వాటా" అనే నినాదంతో నిర్వహిస్తున్న బహిరంగ సభకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను చైతన్యపరిచేందుకు నేడు మధ్యాహ్నం 12.30 గంటలకు హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనాభాలో అధికంగా ఉన్న వర్గాలకు రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం దక్కాల్సిన అవసరంపై సభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధన కోసం ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని ఏసేబు పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు సామాజిక న్యాయాన్ని కోరుకునే ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

# కాట్రపల్లి ఆలయ నిర్మాణంలో అవినీతికి తావివ్వొద్దు

### రూ.4.60 కోట్ల నిధులు పూర్తిగా అభివృద్ధికే వినియోగించాలి

### ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున



**కేసముద్రం/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** కాట్రపల్లి శివ కోటేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనుల్లో అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ ఎండోమెంట్ కార్యాలయంలో సూపరింటెండెంట్ కుమారస్వామికి పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కాకతీయుల కాలం నాటి చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఆలయ పునర్నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయని నాగార్జున తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.4.60 కోట్లు కేటాయించిందని, ఆ నిధులు పూర్తిగా ఆలయ నిర్మాణానికే వినియోగించేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయ నిర్మాణ పనులను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించాలని, ఆలయ పాలకమండలి చైర్మన్‌ను చట్టబద్ధంగా నియమించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారులు తక్షణమే స్పందించి నిర్మాణ పనులను పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యాలయంలో ఘనంగా వీరనారి ఐలమ్మ జయంతి




**తల్లాడ/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం మల్లారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కటి కిరణ్ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కటి కిరణ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దారావత్ యశోద, ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య, కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్య అంజి, వెంకన్న, వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్మికులు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు బిడ్డ.. ఐఐటీ కొట్టాడు!

### నాలుగు ఐఐటీల్లో పీహెచ్‌డీకి ఎంపిక..

### ఐఐటీ రూర్కీలో డాక్టరేట్ క్యాన్సర్ నివారణ ఔషధాలపై పరిశోధన.. పట్టుదలతో ఉన్నత శిఖరాలకు





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబరు 26 (జర్నలిస్ట్ వార్త):** రైతు కుటుంబంలో పుట్టాడు.. వ్యవసాయ పనులు చేస్తూనే చదువుకున్నాడు.. ఆర్థిక ఇబ్బందులు, అవమానాలను అధిగమించాడు.. జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో సత్తాచాటి ఏకంగా నాలుగు ఐఐటీల్లో పీహెచ్‌డీకి ఎంపికయ్యాడు. చివరకు ప్రతిష్ఠాత్మక ఐఐటీ రూర్కీలో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నాడు. ధర్మసాగర్ మండలం నర్సింగరావుపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ మర్రిపల్లి రాజు ప్రస్థానం గ్రామీణ విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

**వ్యవసాయ పనుల నుంచి జాతీయస్థాయికి..**

మర్రిపల్లి రాజామల్లు, యాదమ్మ దంపతుల కుమారుడైన రాజు చిన్ననాటి నుంచే వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటూనే చదువులో రాణించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసించారు. రాష్ట్రస్థాయి సెట్‌తో పాటు జాతీయస్థాయి గేట్, సీఎస్ఐఆర్-నెట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. సీఎస్ఐఆర్-నెట్‌లో ఆల్ ఇండియా 53వ ర్యాంకు సాధించి సత్తా చాటారు.

**నాలుగు ఐఐటీల్లో పీహెచ్‌డీకి ఎంపిక**

201819లో నాలుగు ఐఐటీలతో పాటు ఐదు ఎన్ఐటీల్లో పీహెచ్‌డీకి ఎంపికయ్యారు. తొలుత ఐఐటీ మద్రాస్‌లో పీహెచ్‌డీ పరిశోధనలో చేరిన ఆయన.. అనంతరం ఐఐటీ రూర్కీలోని ఆర్గానిక్, మెడిసినల్ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన కొనసాగించారు. ప్రొఫెసర్ రామకృష్ణ పెద్దింటి పర్యవేక్షణలో క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే ఔషధాల తయారీ, డీఎన్ఏతో వాటి పరస్పర చర్యలపై పరిశోధనలు చేశారు.

**క్యాన్సర్ ఔషధాలపై పరిశోధన**

"సింథసిస్, బయోఫిజికల్ క్యారెక్టరైజేషన్ అండ్ సెల్యులర్ ఎవాల్యుయేషన్ ఆఫ్ అంత్రక్వినోన్ డెరివేటివ్స్ స్టెబిలైజింగ్ హ్యూమన్ టెలోమెరిక్ జి-క్వాడ్రుప్లెక్స్ డీఎన్ఏ ఫర్ యాంటీ క్యాన్సర్ అప్లికేషన్స్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించి పీహెచ్‌డీ పూర్తి చేశారు. పరిశోధనకు సంబంధించిన పలు పత్రాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రచురితమయ్యాయి. ఈ నెల 20న ఐఐటీ రూర్కీలో జరిగిన కన్వొకేషన్‌లో సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ కమల్ కిషోర్ పంత్ చేతుల మీదుగా డాక్టర్ మర్రిపల్లి రాజు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.



కార్యక్రమానికి భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ కుమార్ దోవల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**పట్టుదలే పెట్టుబడిగా..**

సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన రాజు దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడం గ్రామస్తులు, యువత, విద్యార్థుల్లో ఆసక్తి రేపుతోంది. ఎలాంటి కార్పొరేట్ కోచింగ్‌పై ఆధారపడకుండా కష్టపడి చదివి జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం ద్వారా పట్టుదల, అంకితభావంతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని ఆయన నిరూపించారు.

# పుష్ప మృతికి కడియం శ్రీహరి సంతాపం

### బొడ్డు ప్రదీప్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే.. ధైర్యం చెప్పిన శ్రీహరి





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబరు 26 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ బొడ్డు ప్రదీప్ తల్లి బొడ్డు పుష్ప అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం ధర్మసాగర్‌లోని వారి నివాసానికి చేరుకుని పుష్ప పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రదీప్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆప్తులను కోల్పోయిన సమయంలో కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని శ్రీహరి సూచించారు. పుష్ప ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలీయా, ధర్మసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెసరు రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు సాంబరాజు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ వార్త కథనానికి స్పందన




**వర్ధన్నపేట/సెప్టెంబరు 26(జర్నలిస్ట్ వార్త):**

శ్రీ అరబిందో ఉన్నత పాఠశాలకు సంబంధించిన సమస్యలపై జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో బడి భద్రంగానే ఉందా అనే శీర్షికతో లో ప్రచురితమైన కథనంతో సంబంధిత శాఖల అధికారులు స్పందించారు. టౌన్ ప్లానింగ్, విద్యాశాఖ అధికారులు పాఠశాలను తనిఖీ చేసినట్లు సమాచారం. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఠాకూర్ దిలీప్‌సింగ్ మండల విద్యాశాఖ అధికారికి లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించామని, ఆటస్థలంలో బస్సుల పార్కింగ్‌ను తొలగించినట్లు తెలిపారు. పాఠశాలకు గుర్తింపు ఉందని, అవసరమైన పత్రాలను ఎంఈవో కార్యాలయంలో సమర్పించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.


బడి భద్రంగానే ఉందా..?

చీలికలు కనిపిస్తున్న భవనం.. పరిమితమైన ఆటస్థలం -అనుమతులు, భద్రతా ధ్రువపత్రాలపై స్పష్టత ఏదీ..?

పాఠశాల ఆవరణంలో కరెంట్ పోల్ తీగలు...

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో బడి భద్రంగానే ఉందా అనే శీర్షికతో ప్రచురితమైన కథనం

# భీమ్లతాండలో అటవీ అధికారుల ఆకస్మిక దాడి..

### -రూ. 1.01 లక్షల కలప స్వాధీనం.

### -ఎఫ్ఆర్ఓ రవి కిరణ్.



**బయ్యారం/,సెప్టెంబర్ 26.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండలంలోని భీమ్లతాండ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మీపురం సెక్షన్,పందిపంపుల బీట్ పరిధిలోని భీమ్లతాండ గ్రామంలో భారీగా అక్రమ కలప నిల్వ ఉందన్న పక్కా సమాచారంతో బయ్యారం రేంజ్ అటవీ శాఖ అధికారి రవి కిరణ్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ. 57,059/- విలువ గల 0.3674 క్యూబిక్ మీటర్ల టేకు కలపతో పాటు, రూ. 43,996/- విలువైన 0.4436 క్యూబిక్ మీటర్ల టేకుయేతర కలపను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 1,01,055/- విలువైన కలపను సీజ్ చేశారు. ఈ అక్రమ కలప నిల్వపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ వెల్లడించారు. అనుమతి లేకుండా కలపను నిల్వ ఉంచినా, నరికినా చట్టపరమైన తీవ్ర చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ రవి కిరణ్ హెచ్చరించారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

## మొక్కలు నాటి సంరక్షించాలి.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి: కలెక్టర్ స్నేహ శబరీష్

## కంబాలపల్లి చెరువు ప్రకృతి అందాలను తిలకించండి: చైర్‌పర్సన్ జ్యోతి రమేష్






**మహబూబాబాద్/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శనివారం మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలను విరివిగా నాటి, వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి నీటి వనరులను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. కంబాలపల్లి చెరువు పరిసర ప్రాంతాలు ప్రకృతి అందాలతో ఆహ్లాదకరంగా ఉన్నాయని, ఆదివారాల్లో పర్యాటకులు సందర్శించి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, గ్రామ సర్పంచ్ ఉపేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్‌కు కొత్త సారథ్యం

## చైర్మన్‌గా మాధవపెద్ది వెంకటరెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



**మహబూబాబాద్/సెప్టెంబరు 26 (జర్నలిస్ట్ వార్త):**
ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ జిల్లా శాఖకు నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఈ నెల 24న ముగిసిన నామినేషన్ల ప్రక్రియలో 15 మంది సభ్యులు నామినేషన్లు దాఖలు చేయగా, పోటీ లేకపోవడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జాయింట్ కలెక్టర్, ఎన్నికల అధికారి అనిల్ కుమార్ సమక్షంలో నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు.
చైర్మన్‌గా మాధవపెద్ది వెంకటరెడ్డి, వైస్ చైర్మన్‌గా డాక్టర్ బానోతు నెహ్రూ, ట్రెజరర్‌గా గొర్రె వెంకన్న, రాష్ట్ర రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడిగా రావుల రవిచంద్రరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా పరకాల శ్రీనివాస్‌రెడ్డి, విశ్వేశ్వరరావు, రేపూరి వెంకన్న, వాళ్ల మురళీధర్‌రెడ్డి, డాక్టర్ పాల్వాయి సౌజన్య, డాక్టర్ సూర్యకుమార్, నవాబు, కట్ల వెంకన్న, శ్రీనివాస్, కృష్ణప్రసాద్, రామసాయం వెంకట్‌రెడ్డి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో సూపరింటెండెంట్ రాజేష్, ఏవో పవన్, రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన పాలకవర్గానికి రెడ్‌క్రాస్ సభ్యులు అభినందనలు తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన సభ్యులు, అధికారులకు నూతన కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# అడవి జంతువుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

## పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టులో విద్యార్థుల ట్రెక్కింగ్







**సత్తుపల్లి/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టుకు ఒక్కరోజు ప్యాకేజీ టూర్ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఖమ్మం సోషల్ వెల్ఫేర్ పాఠశాల బాలికలను శనివారం పులిగుండాల ఎకో ప్రాజెక్టుకు తీసుకెళ్లారు.
అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎకో టూరిజం ప్రాంతంలో విద్యార్థులకు ట్రెక్కింగ్ నిర్వహించి, అక్కడి ప్రత్యేకతలు, మొక్కలు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణపై అధికారులు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాల వల్ల అటవీ ప్రాంతానికి, వన్యప్రాణులకు కలిగే నష్టాలను వివరించారు.
ఇలాంటి పర్యటనలు విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత, ఏకాగ్రతను పెంపొందించడంతో పాటు కొత్త ప్రాంతాలు, ప్రకృతి విశేషాలను తెలుసుకునే అవకాశం కల్పిస్తాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ట్రెక్కింగ్‌లో ఉత్సాహంగా పాల్గొని ఆనందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, తల్లాడ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉమ, సెక్షన్ ఆఫీసర్ కవిత, బీట్ ఆఫీసర్ కేశవరావు, సోషల్ వెల్ఫేర్ పాఠశాల సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి కొనసాగాలి

## వీరనారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలి: కౌన్సిలర్ పొన్న రాజేష్



**స్టేషన్ ఘన్‌పూర్ /సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):**
భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం దొరల దౌర్జన్యాలను ఎదిరించిన వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరం కొనసాగించాలని 8వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పొన్న రాజేష్ పిలుపునిచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు బస్టాండ్ వద్ద కౌన్సిలర్ పొన్న రాజేష్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ చూపిన తెగువ, ధైర్యం, పోరాట పటిమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. అన్యాయాన్ని ఎదిరించి హక్కుల కోసం పోరాడిన ఐలమ్మ స్ఫూర్తితో సమాజంలో అసమానతలు, దోపిడీకి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పొన్న రవీందర్, పొన్న రాజయ్య, పొన్న యాకయ్య, మచ్చ వెంకటయ్య, లొంక రమేష్, వడ్లకొండ రాంబాబు, గాండ్ల ధనుజయ, సయ్యద్ సాజిద్, రంగు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రం స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

## బీట్ విధులు, రాత్రి గస్తీపై ఆరా..

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశం






**కేసముద్రం/సెప్టెంబరు 26 (జర్నలిస్ట్ వార్త):**
మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ శనివారం కేసముద్రం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఎస్ఐ క్రాంతి కిరణ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది ప్రతిరోజూ గ్రామాలను సందర్శిస్తూ స్థానిక సమస్యలు, నేర ప్రవృత్తులు, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించాలని ఎస్పీ సూచించారు. రాత్రి గస్తీని పటిష్ఠం చేసి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. డయల్-112 ఫిర్యాదులకు తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు.
గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువతకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై గ్రామాలు, విద్యాసంస్థల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విసిటింగ్ అవర్స్‌ను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం, డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాల నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ ప్రజల్లో నమ్మకం పెంచేలా సేవలందించాలని ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు.

# రాజశేఖర్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఐ. రాజశేఖర్ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ రాజశేఖర్ భుజాలపై మూడు పట్టీలు తగిలించి అభినందించారు. విధుల పట్ల నిబద్ధత, బాధ్యతతో పనిచేసినందుకు పదోన్నతి లభించిందని తెలిపారు. ఇకపై కూడా అదే సేవాభావంతో విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు దేవేందర్, శీలం రవి, పొన్నాల గోవర్ధన్‌తో పాటు పోలీస్ సిబ్బంది, తోటి కానిస్టేబుళ్లు పాల్గొని రాజశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# సత్తుపల్లిలో ఘనంగా లిటిల్ స్టార్స్-సూపర్ మామ్స్

## మిరాకిల్ మైండ్స్‌లో ఉత్సాహంగా క్రీడలు





**సత్తుపల్లి/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** సిద్దారం రోడ్డులోని మిరాకిల్ మైండ్స్‌ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం 'లిటిల్ స్టార్స్ & సూపర్ మామ్స్ విత్ మిరాకిల్ టీచర్స్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా తల్లిదండ్రులు పాల్గొని తమ పిల్లలతో కలిసి ఉత్సాహంగా వివిధ వినోదాత్మక క్రీడల్లో పాల్గొన్నారు. ప్రి-ప్రైమరీ విద్యార్థులకు పొటాటో రైస్, బాల్ కలెక్టింగ్, బెలూన్ గేమ్స్ తదితర ఆటలు నిర్వహించారు. పిల్లలు, తల్లిదండ్రుల మధ్య ప్రేమానుబంధాలు, సమన్వయం పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు కార్యక్రమంపై ఆనందం వ్యక్తం చేస్తూ, భవిష్యత్‌లోనూ ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాకర్ మాట్లాడుతూ పిల్లల మానసిక, శారీరక వికాసంతో పాటు తల్లిదండ్రులతో వారి అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు

# స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలి



**సంగెం/సెప్టెంబర్ 26(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం 50వ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంగెం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 27న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ మేనేజ్‌మెంట్ హాల్‌లో జరిగే సభకు జిల్లా పరిధిలోని అన్ని మండలాల నుంచి అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, అంబేద్కర్‌వాదులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. 1976లో అంబేద్కర్ యువజన సంఘం ఏర్పాటై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సామాజిక చైతన్యానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పేర్ల లలిత-రమేష్, మెట్టుపల్లి సునీల్, మహంకాళి మొగిలి, గుండేటి బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై ఎస్ఎఫ్ఐ పరిశీలన



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** పరకాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదా అనే అంశాన్ని పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. పరకాల పట్టణంలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్, పట్టణ కార్యదర్శి అస్రాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త
TELTEL/2023/87607
ఆదివారం 27 సెప్టెంబర్ 2026

# సంక్షేమ పథకాలతో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

## బీఆర్ఎస్, బీజేపీ నుంచి పలువురు నేతలు, కార్యకర్తలు హస్తం గూటికి



**స్టేషన్ ఘన్‌పూర్/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని, అందుకే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన సుమారు 30 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిర్ర నాగరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ బజరంగ్‌దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాయిని అశోక్‌తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన మరో 30 మంది నాయకులు, కార్యకర్తలకు కడియం శ్రీహరి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఉపయోగపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వస్తున్న చేరికలే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు లభిస్తున్న ఆదరణకు నిదర్శనమన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు అన్ని వర్గాల ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేద్దామని కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ గుట్ట ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గడ్డమీది సురేష్, రాజవరం గ్రామ శాఖ అధ్యక్షుడు ఎల్లయ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు సూర్యనారాయణ, మోటం శ్రీనివాస్, యాదగిరి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 12వ తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ ప్రారంభం





**హసన్‌పర్తి/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో 12వ తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్, ఖేలో ఇండియా యూత్ అండర్-18 అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్ కమ్ ఛాంపియన్‌షిప్స్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డితో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు.
రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన యువ అథ్లెట్లు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులకు సరైన ప్రోత్సాహం అందిస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు తీసుకురాగలరని పేర్కొన్నారు. ఖేలో ఇండియా యూత్ అండర్-18 ఎంపిక ట్రయల్స్ ద్వారా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉన్నతస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న అథ్లెట్లకు వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, జిల్లా ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ చైర్మన్, హసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్ పింగళి వెంకటరెడ్డి, 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, జిల్లా సీనియర్ నాయకుడు శివరాం, జిల్లా అథ్లెటిక్స్ సంఘం సభ్యులు, నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దిశ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

## మహిళ నుంచి 6 కిలోల కణితి తొలగింపు



**ఖమ్మం/సెప్టెంబర్ 28 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం పట్టణంలోని ప్రముఖ శ్రీ దిశ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఓ మహిళ శరీరంలో ఏర్పడిన సుమారు 6 కిలోల బరువున్న కణితిని శస్త్రచికిత్స చేసి విజయవంతంగా తొలగించారు. భారీ పరిమాణంలో ఉన్న కణితి కారణంగా మహిళ కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వైద్యులు తెలిపారు. డాక్టర్ రమేష్, ఎంఎస్ జనరల్ సర్జన్, డాక్టర్ అశోక్, అనస్తీషియా వైద్యుల ఆధ్వర్యంలో వైద్య బృందం శస్త్రచికిత్స నిర్వహించింది. సుమారు 6 కిలోల బరువున్న కణితిని జాగ్రత్తగా తొలగించడంతో శస్త్రచికిత్స విజయవంతమైంది. అనంతరం మహిళను వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు.
ప్రస్తుతం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది. వైద్యుల సమర్థవంతమైన చికిత్సతో మహిళకు ఉపశమనం లభించడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేసి, వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.



# ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

## బీఆర్ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు



**నర్సంపేట/సెప్టెంబరు 26 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ జయంతిని నర్సంపేటలో బీఆర్ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరీ విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. పాలకుర్తి గడ్డ నుంచి నాటి రాచరిక, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన ఐలమ్మ జీవితం మహిళా లోకానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, మునిగాల వెంకట్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, తక్కలపెల్లి రవీందర్‌రావు, మచ్చిక నరసయ్య, దార్ల రమాదేవి, గోనె యువరాజు, మండల శ్రీనివాస్, శివరాత్రి స్వామి, రాయిడి దుష్యంత్‌రెడ్డి, దొమ్మటి సంతోష్, నాగిశెట్టి ప్రసాద్, శీలం రాంబాబు, వాసం కరుణ సాంబయ్య, పెండెం వెంకటేశ్వర్లు, తాళ్లపెల్లి రాంప్రసాద్, కడారి కుమార్, పులిగిల్ల యాదగిరి, కొల్లూరి లక్ష్మీనారాయణ, రాయరాకుల సారంగం, ఐలోని శ్రీను, సుధాకర్‌లాల్, కందికొండ శ్రీనివాస్, గాలి శ్రీనివాస్, నాయిని వేణు, మోడం విద్యాసాగర్, పల్నాటి సాంబయ్య, సంపంగి సాలయ్య, పైసా ప్రవీణ్, కొప్పు భాస్కర్, వరంగంటి వెంకన్న, గుండెబోయిన శివకోటి, దోనాల రవి, అడప రాంబాబు, నీరటి రంజిత్, కొమ్మ వీరస్వామి, చాపర్తి బిక్షపతి, మహిళా నాయకులు చింతం విజయరాణి, ఎస్.కె. కాజాబి తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తితో మహిళలు ముందుకు

## ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హసన్‌పర్తి/సెప్టెంబరు 26 (జర్నలిస్ట్ వార్త):** చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా హన్మకొండ న్యూ శాయంపేట చౌరస్తాలోని ఆమె విగ్రహానికి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ఐలమ్మ ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగించడమే ఆమెకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, పీఏసీఎస్ చైర్మన్ పింగళి వెంకటరెడ్డి, 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి సంఘం పెద్దమనిషి బోగి లింగయ్య మృతి పట్ల ఎమ్మెల్యే నాగరాజు సంతాపం

## వాల్మీకి సంఘానికి, కుటుంబ సభ్యులకు తీరని లోటు



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని 64వ డివిజన్ మడికొండకు చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, వాల్మీకి సంఘం పెద్దమనిషి బోగి లింగయ్య ఇటీవల మృతి చెందారు. ఆయన దశదిన కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లింగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వాల్మీకి సంఘం అభ్యున్నతికి, సమాజ సేవకు లింగయ్య అందించిన సేవలను ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు వాల్మీకి సంఘానికి, అభిమానులకు తీరని లోటని పేర్కొన్నారు. లింగయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, 64వ డివిజన్ అధ్యక్షుడు దువ్వ శ్రీకాంత్, 45వ డివిజన్ అధ్యక్షుడు హరీష్ రెడ్డి, మెట్టుగుట్ట దేవస్థానం చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాజీపేట దర్గా పాక్స్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, జిల్లా సీనియర్ నాయకుడు గడ్డం శివరాం, డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బుగులు వెంకటేశ్వర స్వామి కల్యాణం

## భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు



**స్టేషన్ ఘన్‌పూర్/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** చిల్పూర్ మండల కేంద్రంలోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో బి.లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్తల మండలి సభ్యులు గోలీ రాజశేఖర్, వేముల వెంకటేశ్వర్లు, ఈవో లక్ష్మీ ప్రసన్న, ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆదిత్య, అన్నప్రసాద దాతలు వాడిక అశ్విన్ కుమార్‌విరాజిత, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ జయంతి ఘనంగా



**వైరా/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** వైరా పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం పట్టణ అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాసరావు, యువజన అధ్యక్షుడు (బుజ్జి) చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు సంగిపు వెంకన్న, గడసందుల పెద్ద దర్గయ్య, ఏదునూరి చిన్న కోటయ్య, బాసటి రామారావు, గరిడేపల్లి వెంకటనారాయణ, బాసటి హనుమంతరావు, గరిడేపల్లి కిషోర్, జోగినిపల్లి నవీన్, గరిడేపల్లి వెంకన్న, మంకిన ఉపేందర్, ఏదునూరి రాము, రాచకొండ సాయి, రేమల్ల రాము, ఏదునూరి నరసింహారావు, వేల్పుల ఉపేందర్, బాల్లూరి సత్యం, కుడుపుగండి సైదులు, తెల్లగారపు శ్రీను, గడసందుల ఉపేందర్, అనుమోలు సైదులు, కుడుపుగండి వాసు, బాసటి జనార్ధన్, తాళ్లూరి నవీన్, బాసటి సతీష్, రేగళ్ల వీరభద్రం, రేమల్ల కోటేశ్వరరావు, ఏదునూరి పవన్, వడ్లమాని నిఖిల్, ఏదునూరి సాయి, ఏదునూరి చక్రి, కుడుపుగండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..
ఆదివారం 27 సెప్టెంబర్ 2026

# ఐలమ్మ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి




**స్టేషన్‌ఘన్‌పూర్/ సెప్టెంబరు 26 (జర్నలిస్ట్ వార్త):** దొరల దౌర్జన్యాలను ఎదిరించి పేదల భూముల కోసం పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని మున్సిపల్ కౌన్సిలర్, రజక సంఘం జిల్లా నాయకుడు పొన్న రవి పిలుపునిచ్చారు. ఐలమ్మ 131వ జయంతి వేడుకలు స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు.పట్టణ కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పొన్న రవి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి మేనేజర్ సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, రజక సంఘం నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.మండలంలోని తాటికొండ గ్రామంలోనూ రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ సుజన శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఎడమ కట్టమల్లు, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, రజక సంఘం నాయకులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

## దామెరలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

### తెలంగాణ సాయుధ పోరాట వీరనారికి ఘన నివాళి




**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** దామెర మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ వారసుల మండల అధ్యక్షుడు సబ్బు కొమురెల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.దామెర మండల కేంద్రంతో పాటు పెంచికల్‌పేట్, జిలుగుల, జగన్నాథపూర్ తదితర గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల అధ్యక్షులు, సర్పంచుల ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చేసిన పోరాటాన్ని, ధైర్యసాహసాలను నాయకులు కొనియాడారు.దామెర గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గూడెం కొమురయ్య, ఉపాధ్యక్షుడు పాండ్రాల రాజు, కార్యదర్శి పైడాకుల శ్రీనివాస్, చీకటి రమేష్, కుమార్, తిరుపతి, చలం రాజయ్య, సదానందం, పాండవుల సంపత్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు. చాకలి, మంగలి, మాదిగ సామాజిక వర్గాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఐలమ్మకు ఘన నివాళు లర్పించారు. అనంతరం జయంతి సందర్భంగా పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, సొసైటీ బ్యాంకు చైర్మన్ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్ణశాల పండుగ మహోత్సవం ఘనంగా ప్రారంభం



**తల్లాడ/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం కల్లకోడిమ గ్రామంలోని దేవుని సంఘం ఏడవ దిన ప్రార్థన మందిరంలో పర్ణశాల పండుగ మహోత్సవ ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఆదూరి ఆనందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన దేవుని వాక్యాన్ని బోధించారు.
రెండు వేల సంవత్సరాల క్రితం పాపులను రక్షించేందుకు క్రీస్తుయేసు ఈ లోకానికి శరీరధారిగా వచ్చారని, మానవుల పాపాల కోసం సిలువపై తన ప్రాణాలను అర్పించారని పాస్టర్ ఆదూరి ఆనందం పేర్కొన్నారు. క్రీస్తుయేసు తిరిగి రానున్నారని, వెయ్యేళ్ల పాలనలో విశ్వాసులను తనతో ఉంచుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ముద్దునూరు, గన్నవరం, కిష్టాపురం గ్రామాల సేవకులు ఇనపనూరి ప్రకాశరావు, రావూరి కృష, మోదుగు అనిల్‌కుమార్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన విశ్వాసులు పాల్గొన్నారు.

## ఏఐకేఎంఎస్ 4వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి.

### -రైతు కూలీ సంఘం పిలుపు.



**బయ్యారం/,సెప్టెంబరు.(జర్నలిస్ట్ వార్త)**అఖిల భారత రైతు కూలీ సంఘం 4వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలో నిర్వహించిన బైక్ ర్యాలీ ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది.వెంకట్రాంపురం గ్రామం నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ సంగ్యా తండా,జగ్నా తండా,బండ్లకుంట, చీన్యా తండా,బాల్యా తండా,బాలాజీపేట,తీత్రీ తండా,జగ్ని తండా మీదుగా చొక్లా తండా వరకు కొనసాగింది.ఈ సందర్భంగా ఈ నెల 28న ఖమ్మంలో నిర్వహించనున్న భారీ ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని రైతు కూలీలకు,అన్ని వర్గాల ప్రజలకు సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు, బయ్యారం మండల ప్రధాన కార్యదర్శి తోకల వెంకన్నలు మాట్లాడారు.మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు,కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలను,స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.త్వరలో జరగబోయే జాతీయ మహాసభల్లో రైతాంగం, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని స్పష్టం చేశారు.సమరశీల పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని, రైతాంగమంతా ఏకమై బలమైన ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు.ఈ బైక్ ర్యాలీలో ఏఐకేఎంఎస్ నాయకులు ధారావత్ మంగలాల్, నిమ్మరబోయిన సహదేవ్, గుడిబోయిన రమేష్, బండి ప్రభాకర్, నందగిరి సత్యం, వల్లాల బిక్షం, కొత్త రామదాసు, లావుడ్యా గోవర్ధన్, కొత్త అశోక్, ఇస్లావత్ మంగీలాల్, మాలోతు బిక్షం, భూక్యా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉక్కు మహిళ చాకలి ఐలమ్మ

### సాయుధ పోరాటంలో వీరగెరిల్లా యోధురాలిగా ప్రత్యేక గుర్తింపు -బొంకురి రాజు



**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలం ఇంద్రనగర్ గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొంకురి రాజు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రజాకార్లను ఎదిరించి పోరాడిన వీరనారిగా ఆమె తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మను తెలంగాణ ఉక్కు మహిళగా ప్రజలు గౌరవిస్తారని, ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆమె సేవలు తెలంగాణకే పరిమితం కాకుండా దేశ చరిత్రలోనూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని తెలిపారు. రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు చిరస్మరణీయమని అన్నారు.

## ఐలమ్మకు కాంగ్రెస్ నేతల ఘన నివాళి




**తల్లాడ/ సెప్టెంబర్ 26 (జర్నలిస్ట్ వార్త):** చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, మండల కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. నాటి నిజాం పాలన నిరంకుశత్వానికి, దొరల పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు.ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా పోరాటం కొనసాగించిన ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి, ఆత్మగౌరవం, ధైర్యసాహసాలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్, కాంగ్రెస్ నాయకులు మారెళ్ల మల్లికార్జునరావు, పగడాల లచ్చిరెడ్డి, కోదూరు రాము, చారీతో పాటు మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగారంలో వైభవంగా గణనాథుని నిమజ్జనం.



**బయ్యారం/,సెప్టెంబర్ 26.(జర్నలిస్ట్ వార్త)** మండల పరిధిలోని సింగారం పంచాయతీలో ఎస్టీ కాలనీలో సేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక విగ్రహ నిమజ్జన వేడుకలు శనివారం అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక ఉత్సాహంతో జరిగాయి.ఈ కార్యక్రమానికి సింగారం గ్రామ సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు.అనంతరం యూత్ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి ప్రసాదాల వేలం పాట నిర్వహించారు.లడ్డూ ప్రసాదం: రూ. 16,500- లకు గుగులోత్ అమిర్యా దక్కించుకున్నారు.డప్పు వాయిద్యాలు,భక్తుల జయజయధ్వనుల నడుమ నిమజ్జన మహోత్సవం కన్నులపండుగలా సాగింది.ఈ వేడుకల్లో సేవాలాల్ యూత్ సభ్యులు,గ్రామ మహిళలు, చిన్నారులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

### సెప్టెంబరు 30 వరకు దరఖాస్తులకు అవకాశం




**నర్సంపేట/సెప్టెంబరు 26 (జర్నలిస్ట్ వార్త):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 202627 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల గడువును సెప్టెంబరు 30 వరకు పొడిగించినట్లు నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్, అంబేద్కర్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ వి. పూర్ణచందర్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, ఒకేషనల్ లేదా 10+2 ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు.
వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు కనీసం రూ.500 రుసుముతో ప్రవేశం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే రెండో, మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా సెప్టెంబరు 30లోగా అడ్మిషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7382929577 నంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కే. నరేష్, బి. శివ తదితరులు పాల్గొన్నారు.

## హయ్యర్ రెఫరల్ ఆస్పత్రులకు పంపాలి

### సత్తుపల్లి ఉద్యోగుల వైద్యసేవలపై ఐఎన్‌టీయూసీ వినతి



**సత్తుపల్లి/సెప్టెంబరు 26 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి సింగరేణి ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు సత్తుపల్లి నుంచే హయ్యర్ రెఫరల్ ఆస్పత్రులకు పంపించే విధానాన్ని పునరుద్ధరించాలని ఐఎన్‌టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతికుమార్ కోరారు. ఈ మేరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు.ఖమ్మం, హైదరాబాద్, విజయవాడలోని హయ్యర్ రెఫరల్ ఆస్పత్రులకు అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగులను సత్తుపల్లి నుంచే పంపించే ఏర్పాటును గతంలో మాదిరిగా కొనసాగించాలని కోరారు. సత్తుపల్లి డిస్పెన్సరీని ఆధునికీకరించడంతో పాటు గైనకాలజిస్ట్‌ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు పోగుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.డాక్టర్ కిరణ్ రాజ్ సానుకూలంగా స్పందిస్తూ సింగరేణి ఉన్నతాధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

## వైరా మున్సిపాలిటీలో నూతన పారిశుద్ధ్య వాహనాలు ప్రారంభం

### తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణకు చర్యలు



**వైరా/సెప్టెంబరు 26 (జర్నలిస్ట్ వార్త):** వైరా మున్సిపాలిటీ పరిధిలో తడి, పొడి చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన నూతన పారిశుద్ధ్య వాహనాలను వైరా ఎమ్మెల్యే రామదాస్ నాయక్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ చైర్మన్ కాపా చంద్రకళ శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారా చెత్త నిర్వహణను పకడ్బందీగా చేపట్టి పరిశుభ్రమైన వైరా పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

## బయ్యారం ఆసుపత్రికి ఐరన్ బెడ్ బహుకరణ.

### -దాతలను అభినందించిన డాక్టర్ విజయ్ కుమార్.



**బయ్యారం/,సెప్టెంబర్ 26.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం ప్రభుత్వ ఆసుపత్రికి శనివారం నాగిరెడ్డి నరసింహారావు, నాగిరెడ్డి శ్రీనివాసరావు సోదరులు ఐరన్ బెడ్‌ను విరాళంగా అందజేశారు.తన తల్లిదండ్రులు దివంగత నాగిరెడ్డి నారాయణ, దమయంతి జ్ఞాపకార్థం వారు ఈ ఉదారతను చాటుకున్నారు. ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు సౌకర్యవంతమైన వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతోనే ఈ సహాయం చేసినట్లు వారు తెలిపారు.రోగుల సౌకర్యార్థం బెడ్‌ను అందజేసిన నాగిరెడ్డి కుటుంబ సభ్యులను డాక్టర్ విజయ్ కుమార్ అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్, దామోదర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడితోనే అధిక లాభాలు

### -జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న.

**బయ్యారం,/సెప్టెంబర్ 26:(జర్నలిస్ట్ వార్త)** మారుతున్న ఎల్నినో పరిస్థితులలో రైతులు సాంప్రదాయ వరి,పత్తి,మిరప, మొక్కజొన్న పంటలకు భిన్నంగా పంట మార్పిడి చేపట్టి కూరగాయల సాగు వైపు అడుగులు వేయాలని జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు 'మిషన్ వైవిధ్యం' కార్యక్రమంలో భాగంగా శనివారం బయ్యారం మండలం నామాలపాడు గ్రామంలో రైతు వాంకుడోతు దోసిలాల్ సాగు చేస్తున్న కాకర, చిక్కుడు పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో



పరిశీలించారు.నామాలపాడుకు చెందిన రైతు దోసిలాల్ తాత్కాలిక పందిరి విధానం,ఎత్తు మడులు, సేంద్రీయ పద్ధతులు,పంట కుంటలను ఉపయోగిస్తూ వానాకాలం,యాసంగి సీజన్లలో ఎకరానికి రూ. 2 లక్షలకు పైగా ఆదాయం పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారని అభినందించారు.సాగులో ప్రోట్రే నారు పెంపకం,మల్చింగ్,బిందు సేద్యం (డ్రిప్),పందిరి సాగు,ట్రెల్లిస్ పద్ధతి, వేపపిండి, వేపనూనె పిచికారీ, పసుపు రంగు జిగురు అట్టల వాడకం వంటి ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బయ్యారం మండల వ్యవసాయ అధికారి కె.రాజు,వ్యవసాయ విస్తరణ అధికారులు రమేష్,నాగరాజు,రెడ్యా, అఖిల్,ఫయాజ్,స్థానిక రైతులు దోసిలాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.